క్లుప్తంగా

గిన్నిస్ బుక్ అవార్డు అందుకున్న దేవి శ్రీ



ముఖ్యమంత్రి చేతులమీదుగా గిన్నిస్ బుక్ అవార్డు అందుకుంటున్న దేవిశ్రీ

ఒంగోలు మెట్రో: సృష్టి ఆర్ట్స్ అకాడమీ ఒంగోలుకు చెందిన విద్యార్థిని ఆదిపూడి దేవి శ్రీ 150 అడుగుల వెడల్పున వాటర్ పెయింట్‌తో వేసిన మహాత్మా గాంధీ తాత చిత్రానికి లభించిన గిన్నిస్ అవార్డును మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందించారు. చిన్నారి దేవి శ్రీ మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆయన ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు. చిన్నారి తల్లిదండ్రులు ఆదిపూడి నరేంద్ర, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి లలితా మాత జయంతి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో లలితా దేవి

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామి పేటలోని సద్గురు మంచికలపాటి లక్ష్మీ నరసమాంబ వారిచే స్థాపించిన లలితాశ్రమంలో సద్గురు మూర్తి దివ్య ఆశీస్సులతో లలితా మాత 44వ జయంతి మహోత్సవాలు జరగనున్నాయి. శ్రావణ శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ అధ్యక్షురాలు మాతా శ్రీ విజ్ఞానంద సరస్వతి మాతాజీ, స్వయంపాకుల కోటేశ్వర శర్మ తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి



బాధ్యతలు స్వీకరించిన ఒంగోలు తహసీల్దార్‌ను సత్కరిస్తున్న వీఆర్‌ఓలు

ఒంగోలు అర్బన్: రెవెన్యూ కార్యాలయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలు అందించాలని ఒంగోలు తహసీల్దారు వాసు వీఆర్‌ఓలకు సూచించారు. ఈ మేరకు ఒంగోలు తహసీల్దార్‌గా నెలబొట్ల వాసు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను వీఆర్‌ఓలు సత్కరించి అభినందించారు. వీఆర్‌ఓ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసీ ఆదిరెడ్డి, ఇతర వీఆర్‌ఓలు రాంబాబు, రమణి, సురేష్, శ్రీనివాసరెడ్డి, అంకిరెడ్డి ఉన్నారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

ఒంగోలు రూరల్: ఏబీఎం గ్రౌండ్స్‌లో సోమావారం ఏబీఎం గ్రౌండ్స్‌లో జరిగిన సాఫ్ట్‌బాల్ రాష్ట్ర సెలక్షన్స్‌కు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. త్రోవగుంట జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన ఇద్దరు బాలికలు, ఒక బాలుడు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. సాఫ్ట్ బాల్ పోటీలు ఈనెల 17 న శ్రీకాకుళం లో జరుగనున్నాయి. జిల్లా తరఫున వీరు పాల్గొననున్నట్లు స్కూల్ హెచ్. ఎం. చల్లా బ్రాహ్మయ్య తెలిపారు.

పారిశుద్ధ్య జాగ్రత్తలు తీసుకోండి



పనులు పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు

ఒంగోలు: పారిశుద్ధ్య కార్మికులు గ్లౌజులు, ఆప్రాన్స్ ధరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు అన్నారు. మంగళవారం లంబాడీడొంక, కర్నూల్‌రోడ్డు, గుంటూరు రోడ్డు, సుజాతనగర్, చెన్నకేశవ లేఅవుట్, మంగమూరు డొంక ప్రాంతాల్లో పనులను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా నీరు నిలబడి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కాలువలలో సిల్టు తొలగించి మురుగునీరు నిలబడకుండా చూడాలన్నారు. పరిశుభ్రమైన నగరంగా ఉంచాలని శానిటేషన్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. పారిశుద్ధ్యానికి సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శునకాలతో టెన్షన్.. టెన్షన్



శర్మ కాలేజీ క్రికెట్ గ్రౌండు వద్ద మామిడిపాలెం వెళ్లే రహదారిలో వీధి కుక్కలు

- పట్ట పగలే రోడ్లపై బైఠాయింపు
- కుక్కలతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- నియంత్రించడంలో నగరపాలక సంస్థ నిర్లక్ష్యం
- పాదచారులు, వాహనదారులపై దాడులు

ఒంగోలు: పట్టపగలే కుక్కలు గుంపులుగా కుక్కలు నడి రోడ్డులో తిష్టవేస్తూ పాదచారులు, వాహనదారులను బెంబేలెత్తుతున్నారు. చికెన్, మటన్, ఫిష్ కవర్లు పట్టుకొనే వెళితే.. అవి పీక్కు తినేలా పరిస్థితి భయానకంగా మారింది. దాదాపు 15 శునకాలు స్థానిక సీతారామపురంలో శర్మా కాలేజీ క్రికెట్ గ్రౌండు సమీపంలో తిష్టవేస్తున్నాయి. వర్షపునీటిని తాగే కుక్కలకు త్వరగా పిచ్చి పడుతుందని, తద్వారా అవి కరిచాయంటే అంతే సంగతులు అంటూ జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే శర్మకాలేజీ పరిసరాల్ల కూడా రాత్రి సమయంలో పదులకొద్దీ కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. అంతే కాదు నగరంలో ఏ వీధిలో చూసినా వీటి తాకిడి ఎక్కువై పోతోంది. కుక్కలను నియంత్రించాల్సిన నగరపాలక సంస్థ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముర్రుపాలు వెంటనే తాపాలి



బాలాజీ నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: బిడ్డ పుట్టిన అరగంటలోనే ముర్రుపాలు పట్టాలని, అవి బిడ్డకు జీవితాంతం రక్షణ కలిస్తాయని కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ కె. భాస్కర్ చెప్పారు. ప్రపంచ తల్లిపాల దినోత్సవంలో భాగంగా మంగళవారం నగరంలోని బాలాజీ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఆయన ప్రసంగిస్తూ తల్లి పాల ద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, శిశువులు అనారోగ్యం బారినపడకుండా ఉంటారని తెలిపారు. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. తొలి ఆరునెలలు తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలు పట్టించాలని, ఆ తదుపరి 2 ఏళ్ల పాటు బిడ్డకు పాలివ్వాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అశ్విన్ సూచించారు. బిడ్డకు పాలివ్వడం వలను తల్లికి, బిడ్డకు మేలు చేస్తుందన్నారు. పాలుపట్టే తల్లులు మానసిక ఆందోళన, ఒత్తిడికి దూరంగా ఉండాలని, మంచి పోషకాహారం తీసుకోవాలని సలహా ఇచ్చారు. అనంతరం వైద్య సిబ్బంది, నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు, వైద్య విద్యార్థులతో బాలాజీ నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ జి. సాయి సంతోష్ కుమార్, హెల్త్ సూపర్ వైజర్ నిర్మల జ్యోతి, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసన్న పాల్గొన్నారు.

విశేషంగా గౌరీ దేవి పూజలు



మంగళ గౌరీ దేవి పూజలో దంపతులు



సామూహిక కుంకుమార్చనలో భక్తులు

ఒంగోలు మెట్రో: శుభ శ్రావణమాసం తొలి మంగళవారం పురస్కరించుకొని ఒంగోలు నగరంలోని అమ్మవారి దేవాలయాల్లో సామూహిక కుంకుమ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక గంటపాలెంలోని పార్వతీ అమ్మవారికి, బాలాజీ రావు పేటలో శ్రీ కనకదుర్గమ్మ వారికి, కేశవ స్వామి పేటలోని విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో విశేష పూజలు జరిగాయి. శ్రీ చక్రానికి దేవి ఖడ్గమాలతో భక్తులకు సామూహికంగా కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

జ్వరపీడితుల వివరాలు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్

బేస్తవారిపేట: జ్వరంతో వైద్యశాలకు వచ్చిన వారి వివరాలు నమోదు చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.పృథ్వీరాజ్, కావ్య అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రైవేట్ డాక్టర్లు, బీహెచ్ఎంఎస్, బీఏఎంఎస్, ఆర్ఎంపీ, పీఎంపీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డెంగీ కేసులపై ఎలీషా టెస్ట్ మనకు అందుబాటులో లేనందున వచ్చిన రోగులను భయభ్రాంతులకు గురిచేయవద్దని, పీహెచ్‌సీ ఫీల్డ్ స్టాఫ్‌కు సమాచారం అందించాలని కోరారు. సీహెచ్ఓ, హెల్త్ సూపర్‌వైజర్స్, ఏఎన్ఎం, ఎంఎల్‌పీలకు ఫోన్ చేసి ఒక ప్రాంతంలో ఎక్కువగా జ్వరం కేసులు వస్తుంటే వివరాలు తెలపాలన్నారు. వైద్యం చేసేటప్పుడు యాంటీబయాటిక్స్, కార్టిజోన్స్ అధిక మోతాదులో వాడకూడదని, అలా వాడినప్పుడు రోగికి ఏదైనా జరగకూడనిది జరిగితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఆసీఫ్ ఖాన్



తువ్వపాడులో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ

మార్కాపురం టౌన్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని న్యాయవాది ఆసీఫ్‌ఖాన్ అన్నారు. మంగళవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు సచివాలయాల్లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల మూడు కొత్త చట్టాలను అమలులోనికి తీసుకొచ్చిందని వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఐపీసీ, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య ఆదినియంను తీసుకొచ్చినట్లు వివరించారు. సచివాలయాల్లో ప్రభుత్వ సేవలు లభించకపోతే, న్యాయపరమైన ఇబ్బందులు వస్తే మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు.

కొత్త చట్టాల గురించి తెలుసుకోవాలి

కొనకనమిట్ల: కొత్త చట్టాల గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ మాధవరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తువ్వపాడు గ్రామంలో పర్యటించి శాంతి భద్రతలు, కొత్త చట్టాలు, న్యాయపరమైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా కలిసిమెలసి ఉండాలని సూచించారు. అనంతరం జాతీయ రహదారిపై కొనకనమిట్ల సమీపంలో పలు వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు.

వక్ఫ్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే సహించం

మార్కాపురం: ఎన్‌డీఏ ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ ముస్లింల హక్కులను హరిస్తోందని మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేత సయ్యద్ జావీద్ అన్వర్ విమర్శించారు. మంగళవారం ఆయన మార్కాపురంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో వక్ఫ్ బోర్డు స్వయం ప్రతిపత్తిని హరించేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కొత్త చట్టం తేవాలని కుట్ర చేస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కు తీసుకోకుంటే ముస్లింల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ముస్లిం సమాజ అభివృద్ధికి ప్రభుత్వాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

కొత్తపట్నం: ఈ నెల 8న జరగబోవు ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎంఈవో-2 పద్మావతి తెలిపారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో 52 పాఠశాలలున్నాయని అందులో ఉన్నత పాఠశాలలు 6, కేజీబీవీ 1, యుపీ స్కూల్స్ 2, ఎంపీపీ స్కూల్స్ 43కు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులంతా ఈ నెల 8న పాఠశాలలకు వచ్చి చైర్మన్‌ను, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుని ఆ పాఠశాలలకు అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఇప్పటికే తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రాలు పంపించామన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన



పంటలు పరిశీలిస్తున్న డీపీఎం సుభాషిణి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

ఒంగోలు రూరల్: ప్రతి రైతు భూసార పరీక్ష చేయించుకొని వాటి ఫలితాలను బట్టి ఎరువులు వాడుకొని పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు సూచించారు. ఉలిచి పరిధిలో మంగళవారం రైతులకు భూసార పరీక్షలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆత్మ డీసీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ నాణ్యత కలిగిన వ్యవసాయ ఉత్పత్తులను పండించాలని సూచించారు. ఏపీ సీఎన్ ఎఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిని, మండల వ్యవసాయ అధికారి కిషోర్ బాబు, పకృతి వ్యవసాయ అధికారి రాధా సింగమనేని, జిల్లా వ్యవసాయ అధికారి జేడీఏ శ్రీనివాసరావు, డీపీఎం సుభాషిణి, ఆత్మ డీపీడీ సుబ్రహ్మణ్యం, రామ్మోహన్, శైలజ, శేషమ్మ హాజరయ్యారు.

గృహ ప్రవేశానికి హాజరైన ‘ఉడుముల’



కాసును అభినందిస్తున్న ఉడుముల శ్రీనివాసులరెడ్డి

కొనకనమిట్ల: మండలంలోని బచ్చలకూరపాడు పంచాయతీ మెట్టువారిపల్లి గ్రామంలో ‘కాసు’ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఎన్ఆర్ఐ కాసు వెంకటేశ్వరరెడ్డి నూతన గృహ ప్రవేశానికి మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాసు మాట్లాడుతూ.. తమ చారిటబుల్ ట్రస్ట్ తరఫున మండలంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గృహ ప్రవేశంలో పాల్గొన్న వారిలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు విఘ్నేష్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, మాజీ ఎంపీపీ మాదాల బ్రహ్మయ్య, బత్తుల రామకృష్ణారెడ్డి, రామిరెడ్డి, ఈర్ల బాలవెంకటేశ్వర్లు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

దర్శి: అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు మంచా నాగార్జున కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి వి. బాలకోటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పోతవరంలో ఆత్మహత్య చేసుకున్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కౌలు రైతు కుటుంబాన్ని ఆయన మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాలకోటయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలతో ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగాయన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కూడా లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు అప్పులపాలవుతున్నారన్నారు. అప్పులు తీర్చలేక భూమిని వదలలేక మానసిక ఒత్తిడికి గురైన రైతులు బాధతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. ఇవి ప్రభుత్వ హత్యలే అని మండిపడ్డారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదని, ప్రభుత్వ విధానాలపై పోరాడి వ్యవసాయ రంగాన్ని బతికించుకోవడం కోసం పోరాడాలని రైతులను కోరారు. ఏపీ రైతు సంఘ మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు తాండవ రంగారావు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ముండ్లమూరు: ఈ నెల 8వ తేదీన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 52 ప్రాథమిక, ఎనిమిది ప్రాథమికోన్నత, ఎనిమిది ఉన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. 68 పాఠశాలల్లో ఎన్నికల సందర్భంగా ఎలాంటి గొడవలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందుగా పోలీసుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని తగిన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నిక సందర్భంగా ఓటు చేసేందుకు వచ్చే సమయంలో ఆధార్‌కార్డు, ఓటరు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. సమస్యాత్మక పాఠశాలల వివరాలను ముందుగా తెలియజేయాలన్నారు. సమావేశంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలేరమ్మతల్లి ప్రతిష్ఠ ఉత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. బుధవారం గంగానయనం, గోపూజ, గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, బుధ, గురువారాల్లో గ్రామోత్సవాలు, పోలేరమ్మ, పోతురాజుస్వామి, విమాన గోపురశిఖర, కలశ ప్రతిష్ఠను కారంచేటి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని వివరించారు.

చుండూరు కేసులో నిందితులెవరు?



చుండూరు అమరులు, గద్దర్ వర్ధంతి నిర్వహించిన ప్రజా సంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: చుండూరు మారణకాండ జరిగి నేటికి 33 సంవత్సరాలు గడిచినా నిందితులకు శిక్షలు పడకపోవడం దారుణమని, అంతా నిర్దోషులే అయితే మరి నిందితులెవరని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ ప్రశ్నించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట మంచి పుస్తకం వద్ద చుండూరు అమరుల 33వ వర్ధంతితో పాటు ప్రజాయుద్ధ నౌక గద్దర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన ప్రసంగిస్తూ కేవలం తమకు ఓట్లేయలేదన్న కారణంతో అగ్రకుల దురహంకారులు 11 మందిని నరికి వేసిన రక్త చరిత్ర దేశ ముఖచిత్రంపై చెరగని మచ్చలా నిలిచిపోయిందన్నారు. నేటికీ మాలమాదిగల పల్లెలపై దాడులు నిరంతరంగా జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మరక్షణ ప్రతిఘటన దళితుల హక్కని, ఎక్కడ దాడులు జరిగినా సమైక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దోపిడీ వివక్షలకు వ్యతిరేకంగా గళంవిప్పిన గద్దర్ భారత విప్లవోద్యమంలో, సాంస్కృతిక రంగంలో కొత్త ఒరవడి సృష్టించారని చెప్పారు. బొట్ల రామారావు, సువర్ణబాబు, ఎంఏ సాలార్, సత్యం, మన్నం రమేస్, గుత్తి కోటేశ్వరరావు, ఆవుల సుబ్రమణ్యం, వి. శివరావు, బాబు, పిన్నికి శ్రీను, కాళ్ల హరిప్రసాద్, దాసరి సుందరం, పేరయ్య పాల్గొన్నారు.

‘చుండూరు గుండెల గాయం’ పాట ఆవిష్కరణ



చుండూరు గుండెల గాయం పాటను ఆవిష్కరిస్తున్న దళిత ప్రజా సంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: అగ్రవర్ణాల క్రూరమైన దాడిలో మృతి చెందిన 8 మంది చుండూరు మృతులను స్మరించుకుంటూ ధిక్కార కవి కలేకూరి ప్రసాద్ రాసిన, ప్రముఖ ప్రజా గాయకుడు శరత్ బాబు ఆలపించిన కుమిలి పోయిన నలిగి పోయిన చుండూరు గుండెల గాయం పాటను మంగళవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర బహుజన్, బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకటరావు ప్రసంగిస్తూ...చుండూరు గ్రామంలో 8 మందిని దారుణంగా హత్య చేసిన సంఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిందన్నారు. ఆ నేపథ్యంలో మహాకవి కలేకూరి రాసిని కమిలిపోయి, నలిగిపోయిన పాట ఉద్యమానికి ఊపిరి పోసిందని, ఇన్నాళ్ల తరువాత ఆ పాటను శరత్ ఆలపించి భవిష్యత్తరాలకు చుండూరు గాయాన్ని గుర్తు చేశారని చెప్పారు. మున్ముందు దళిత ప్రజా కళాకారులు ఉద్యమాలలో ముందుండి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పాటకు సంగీతం సమకూర్చిన వెస్లీ, ఎడిటింగ్ చేసిన షాన్, కోరస్ పాడిన కట్టెడ నాగరాజు, అంజిని అభినందించారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కరవది సుబ్బారావు, బహుజన కెరటాలు ప్రతినిధి చప్పిడి కోటేశ్వరరావు, బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారాబత్తిన జాల రామయ్య పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ సాయికుమార్

బేస్తవారిపేట: సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డివిజనల్ లెవల్ డెవలప్‌మెంట్ అధికారి సాయికుమార్ సూచించారు. మండలంలోని పెద్ద ఓబినేనిపల్లె, నేకునాంబాద్ సచివాలయాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయాల్లో పని చేయని ప్రింటర్స్, కంప్యూటర్స్ సమాచారం ఎంపీడీఓకు పంపాలని సూచించారు. వారం రోజుల్లో పూసలపాడులో ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఆధార్ నమోదు స్పెషల్ క్యాంపునకు మండలంలో షెడ్యూల్ వేసి జిల్లా కేంద్రానికి పంపాలని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. రాష్ట్ర స్థాయిలో అనుమతి తీసుకున్న తర్వాతనే ఆధార్ నమోదు ప్రారంభించాలని తెలిపారు. సచివాలయాల్లో మూవ్‌మెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈఓపీఆర్డీ పి.రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శానిటేషన్ వర్కర్ల వేతనాలు చెల్లించాలి



వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న వర్కర్లకు వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య కోరారు. శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు 7 నెలల నుంచి జీతాలు చెల్లించక పోవడంతో పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్యాలయం నిర్వాహకుడికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు అందక ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ప్రభుత్వం వారికి జీతాలు చెల్లించాలని కోరారు. సీఐటీయూ నాయకులు, శానిటేషన్ వర్కర్ల యూనియన్ నాయకులు సమీరా, పుష్ప, వై.రాధ, జహీరా, మౌలాబీ పాల్గొన్నారు.

గోడను తొలగించేందుకు విఫలయత్నం



స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

కంభం: దారికి అడ్డంగా రేకుల షెడ్డు వేశారని స్థానికులు ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు.. స్థానిక వై.జంక్షన్ సమీపంలో ఇరిగేషన్ కాలువ పక్కన రేకుల షెడ్డు వేయడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని స్థానికంగా నివాసం ఉండే మహిళలు, ప్రజలు అక్కడికి వచ్చి గడ్డపారలతో గోడలు పగలగొట్టేందుకు ప్రయత్నించగా యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమతులు లేకుండా పగలగొట్టడం నేరమని అధికారుల ద్వారా చర్యలు తీసుకోవాలని చెప్పడంతో వారు వెనుదిరిగారు. అనంతరం మహిళల పోలీసుస్టేషన్‌కు వెళ్లారు.